క్లుప్తంగా

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



కమిషనర్ రామకృష్ణారావుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

నిజాంపేట్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేసేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం నిజాంపేట్ కమిషనర్‌కు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న తరహాలో కార్మికులకు రూ.21వేల జీతం ఇవ్వాలన్నారు. సీఎం అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. వయసు మీరిన పారిశుద్ధ్య కార్మికులను తొలగిస్తే వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి అవకాశం కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.10 లక్షలు ఇవ్వాలని.. వారసులు లేని పక్షంలో రూ.15లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను తీర్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్, లెనిన్‌నగర్, రింగ్ బస్తీలలో ఉదయం 10 నుంచి 12గంటల వరకు..

◆ జగద్గిరిగుట్ట ఫీడర్‌లలో జగద్గిరిగుట్ట, అంజయ్యనగర్, మైసమ్మనగర్, సోమయ్యనగర్, బీరప్పనగర్‌లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ రాధాకిషన్ ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

సుభాష్‌నగర్: నేటి కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని దుండిగల్ మండల తహసీల్దార్ సుచరిత అన్నారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని అంగన్‌వాడీ 2వ సెంటర్‌ను శుక్రవారం ఆమె సీడీపీవో హెబ్సిబాతో కలిసి సందర్శించారు. సెంటర్‌లోని విద్యార్థుల సంఖ్య, పనితీరును టీచర్ నాగరాణిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారి మనోజ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ. సూపర్వైజర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి మనజీతో కేక్ కట్ చేయిస్తున్న తహసీల్దార్ సుచరిత

థాంక్యూ కేసీఆర్ సార్

బలవర్ధక అల్పాహారం.. పిల్లల మొహంలో ఆనందం

- సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్
- బహదూర్‌పల్లి విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న ఎమ్మెల్యే
- అల్పాహారం వడ్డించిన నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి



ప్రగతినగర్‌లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న మేయర్ నీలారెడ్డి



విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం వల్ల విద్యార్థుల మేధస్సు మరింత చురుగ్గా పనిచేసి చదువుల్లో రాణిస్తారని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బహదూర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్‌ను పాఠశాలల్లోనే ఇస్తామన్నారు. బలవర్ధకమైన ఆహారం లేక ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ పథకం వల్ల విద్యార్థుల డ్రాప్ అవుట్స్ చాలా వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను సైతం మెరుగు పడుతుందన్నారు.

"చాలా మంచి టిఫిన్ పెట్టారు..



టిఫిన్ కోసం ఇంటి దగ్గర అమ్మ రెడీ చేసే వరకు వెయిట్ చేయకుండా స్కూల్ బ్యాగ్ తీసుకొని స్కూల్‌కు టైమ్‌కు రావచ్చు. ఇంటి దగ్గర టిఫిన్ తిని వచ్చే వరకు స్కూల్‌కు రావడం ఒక్కోసారి ఆలస్యం అయ్యేది. ఇప్పుడు ఆ బాధ లేదు. చాలా మంచి టిఫిన్ పెట్టారు. హ్యాపీగా ఉంది. – రమ్య, తొమ్మిదో తరగతి

చాలా టేస్టీగా ఉంది..



ఉదయం రాగానే బ్రేక్ ఫాస్ట్ పెడుతున్నారనగానే చాలా సంతోషం అయ్యింది. మాకు ఇచ్చిన పూరి చాలా టేస్టీగా ఉంది. స్కూల్ లో ఉచితంగా బ్రేక్ ఫాస్ట్ పెట్టడం చాలా థ్రిల్లింగా ఉంది. ఇంత మంచి బ్రేక్ ఫాస్ట్ మా స్కూల్‌లో పెట్టడం నిజమా అని అనిపించింది. థ్యాంక్ సీఎం కేసీఆర్ సార్.

– చైతన్య, ఎనిమిదో తరగతి

హోటల్లో తిన్నట్టుంది..



ప్రతిరోజు ఉదయం విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు కేసీఆర్ తాత ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. మొదటి రోజు, పూరి, ఉప్మా, ఇడ్లీ స్వీటు ఇచ్చారు. అల్పాహారం ఎంతో రుచికరంగా ఉంది. అల్పాహారం తింటుంటే ఖరీదైన హోటల్లో టిఫిన్ తింటున్నట్టు అనుభూతి అనిపించింది.

– బి.రూప, పదో తరగతి

అల్పాహారం అందించడం సంతోషం



మేము బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో ఉంటాం. అమ్మానాన్నలు కంపెనీలో పని చేస్తారు. ప్రతిరోజు ఉదయం అన్నం తిని వస్తాను. ఎప్పుడైనా ఒక్కసారి అమ్మా నాన్న దగ్గర డబ్బులు తీసుకొని టిఫిన్ తినేవాడిని. ప్రతిరోజు స్కూల్లో అల్పాహారం అందించడం సంతోషంగా.

– నవాజ్, పదో తరగతి

రిజిస్టరైన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన బీజేపీ నాయకులు

నిజాంపేట్: జీవో 59 కింద కార్పొరేటర్లకు రిజిస్టర్ అయిన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాచుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో జీవో 59 అవకతవకలపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. బాచుపల్లి కౌసల్య కాలనీలోని సర్వే నం .319లో రూ.10 కోట్ల విలువ చేసే 12 గుంటల భూమిని ప్రస్తుతం కార్పొరేటర్లుగా కొనసాగుతున్న వారికి జీవో 59 కింద రిజిస్టర్ చేయడం దారుణమన్నారు.

◆ అప్పట్లో ఈ విషయమై బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టగా అప్పటి తహసీల్దార్ ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేయాలని బీ/426/2021 నోటీసును ఇద్దరు కార్పొరేటర్లకు జారీ చేశారని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులుగా కొనసాగుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఇద్దరు కార్పొరేటర్లపై తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో భిక్షపతి యాదవ్, ప్రసాద్, సాయిరెడ్డి, అశోక్‌నాయక్, ప్రసాద్‌రాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

దుండిగల్: పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తుంటే కొంత మంది అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని... రాజకీయ కోణంలో కాకుండా విద్యార్థుల ఉన్నతి కోసమే పని చేస్తున్నామని కూన కృష్ణగౌడ్ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలనే ఉద్దేశంతోనే తమ ట్రస్ట్ కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. మంచి పనులు చేస్తుంటే సహకరించాల్సింది పోయి అడ్డంకులు సృష్టించేందుకు ప్రయతిస్తున్నారని, ఎన్ని అవంతరాలు ఎదురైనా పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి నేతలు కృష్ణా రెడ్డి, గోనె మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సీతారాంరెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వీరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బూత్‌ను మార్చుకునే వెసులుబాటు కల్పిస్తాం



జిల్లా జాయింట్ కలెక్టర్ జితేందర్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: ఒకే ఇంటి నంబర్‌పై పదుల సంఖ్యలో ఓటర్లు నమోదు విషయమై బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పొన్నాల హరీష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కొంపల్లి మున్సిపల్ బీజేపీ నేత శివాజీ నేత పలు అభ్యంతరాలను లేవనెత్తారు. కొంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన 54, 57 పోలింగ్ బూత్‌లలో స్థానికులతో పాటు స్థానికేతరులు సైతం ఓట్లు కలిగి ఉండటాన్ని కుత్బుల్లాపూర్ ఆర్‌ఓ సైదులు దృష్టికి తీసుకువెళ్లారు.

◆ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలనే సదుద్దేశంలో అధికారులు నూతన బూత్‌లను ఏర్పాటు చేశారన్నారు. అయితే ఎన్‌సీఎల్‌లో ఉండే వారికి కొంపల్లి బూత్‌లో ఓటు హక్కు ఉండటంతో నాలుగు కిలోమీటర్లు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపరన్నారు. దీనిపై స్పందించిన సైదులు ఫారం-8 ద్వారా బూత్‌ను మార్చుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్ సాగర్, కళ్యాణ్, కుత్బుల్లాపూర్ ఈఆర్వో నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు



మొదలైన పనులు..

సాక్షి ఎఫెక్ట్..

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రాంతాలలో నాలాలు, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యపై గత నెల 29న సాక్షిలో 'ప్రమాదకరంగా నాలాలు, కల్వర్టులు'అనే శీర్షిక కథనం ప్రచురితమయ్యింది. దీనిపై స్పందించిన అధికారులు గణేష్‌నగర్ నాలా వద్ద పనులు ప్రారంభిచారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసి 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే అధికారంలోకి తీసుకొస్తాయి



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న హమాలీలు

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మూడోసారి అధికారంలోకి తీసుకు వస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలో రూ.9.2 కోట్ల నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. కైసర్‌నగర్, రావినారాయణరెడ్డినగర్, బాలయ్యనగర్, మహదేవపురం, బాలాజీ లేఅవుట్, ఇందిరగాంధీనగర్, ఉషోదయ కాలనీ, చంద్రగిరి కాలనీ, లెనిన్‌నగర్, పీఎం రెడ్డినగర్, రోడామేస్త్రీనగర్, తదితర ప్రాంతాల్లో భూరగ్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, కమిటీ భవనాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, ఆయా విభాగాల అధికారులు ఉన్నారు. హమాలీ వర్కర్స్ సంక్షేమ సంఘం భవనానికి స్థలం మంజూరు చేసిన నేపథ్యంలో శుక్రవారం హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరించారు. ఉమామహేష్, లక్ష్మణ్, స్వామి, దేవదానం, శ్రీను, నాగయ్య, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మహిళ ఆత్మహత్య




సునుగురి అనిత (ఫైల్ ఫోటో)

జగద్గిరిగుట్ట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సునుగురి అనిత (23), మల్లేష్‌యాదవ్ భార్యభర్తలు. వీరు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి రెండేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం వీరు శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోవడంతో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా గురువారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం లేచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్తమామలు హింసించడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని అనిత తల్లిదండ్రులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

జగద్గిరిగుట్ట: మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి మేడ్చల్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చింది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ, దత్తాత్రేమయ కాలనీకి చెందిన మహిపాల్‌రెడ్డి(48) 2019లో స్థానికంగా ఉండే మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న పోలీసులు అప్పట్లో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం కేసు తుది తీర్పును వెల్లడించిన అడిషన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరావు పైన తెలిపిన విధంగా తీర్పునిచ్చినట్లు జగద్గిరిగుట్ట సీఐ కాంత్రికుమార్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్‌రెడ్డి వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం చింతల్ బస్టాప్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 50సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే జీడిమెట్ల పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

పదో అంతస్తుపై నుంచి పడి కార్మికుడు మృతి



ఉత్తం బిష్వాష్



నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్

జగద్గిరిగుట్ట: నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ భవనం నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ కార్మికుడు మృతిచెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఉత్తం బిష్వాష్ (35) కొంత కాలంగా ఎల్లమ్మబండ అపార్ట్‌మెంట్‌లో పనులు చేస్తున్నాడు. కాగా ఎప్పటిలాగానే శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో పనులు చేస్తుండగా అపార్ట్‌మెంట్‌లోని 10వ అంతస్తు నుంచి కింద పడ్డాడు. దీంతో అక్కడే పని చేస్తున్న తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసి దరర్యాప్తు చేపట్టారు.

యాచకురాలికి పురుడు పోసిన 108 సిబ్బంది, కానిస్టేబుల్

- గాంధీ ఆస్పత్రికి తరలింపు
- తల్లీబిడ్డ క్షేమమని తెలిపిన వైద్యులు



108 వాహనంలో తల్లిబిడ్డ..

జీడిమెట్ల: పురిటి నొప్పులు భరించలేక రోడ్డుపై పడిపోయిన ఓ యాచకురాలికి 108 సిబ్బంది ఓ మహిళా కానిస్టేబుల్ సహాయంతో పురుడు పోశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 11.30గంటల ప్రాంతంలో ఐడీపీఎల్‌లోని డొమినోస్ సందులో ఓ గర్భిని పురిటి నొప్పులతో అవస్థ పడుతున్నట్లు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు 108 సిబ్బంది రాజు, శ్రీనివాస్‌లకు విషయం తెలిపి ఐడీపీఎల్ వద్దకు వాహనం పంపించారు. అప్పటికే ప్రసవ వేదనతో తల్లడిల్లుతున్న మహిళకు 108 సిబ్బంది ఓ లేడీ కానిస్టేబుల్ పురుడు పోయగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. జీడిమెట్ల సీఐ పవన్ సూచన మేరకు సదరు మహిళను 108 సిబ్బంది గాంధీ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆమె ఎవరు..?

సదరు మహిళను పోలీసులు, 108 సిబ్బంది వివరాలు అడగగా తన పేరు కృష్ణవేణి అని తాను యాచకురాలిని అని తెలిపింది. దీంతో పాటు తనకు ఎవరూ లేరంటూ ఒంటిరిగా ఉంటూ భిక్షాటన చేస్తున్నట్లు మాత్రమే తెలిపిందని పోలీసులు అంటున్నారు.

వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలి

కుత్బుల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మార్పిఎస్ అధ్యక్షుడు రాసమల్ల యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు. ఈ నెల 7వ తేదీన ఆలంపూర్‌లో ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర పోస్టర్‌ను శుక్రవారం మున్సిపల్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరులో జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇసురం రమేష్ మాదిగ, మట్ట నర్సింహులు, భూమయ్య, జాన్, మహిళా నాయకురాలు సలోమీ, విజయ్ కుమార్, వెంకట్ స్వామి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికాగ్రహం

- 16నెలలుగా సూపర్‌మ్యాక్స్ కార్మికుల రిలే నిరాహార దీక్ష
- ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రగతిభవన్ ముట్టడికి పిలుపు
- ఎక్కడికక్కడే కార్మిక నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- నర్సాపూర్ రహదారిపై ధర్నాకు దిగిన కార్మికులు
- మద్దతు పలికిన బీజేపీ, కాంగ్రెస్, వైఎస్సార్‌టీపీ, లెఫ్ట్ పార్టీలు



కార్మికులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ ఉద్యోగులకు న్యాయం చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, కార్మికమంత్రి మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద విఫలం అవ్వడం సిగ్గుచేటని విపక్షాల నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. 16 నెలలుగా సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు న్యాయం కోసం రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. పూట గడవక ఇప్పటికే సూపర్‌మ్యాక్స్ పరిశ్రమలో పనిచేసిన కార్మికుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ఇన్ని ఇబ్బందులు పడుతూ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిపై మండిపడిన కార్మికులు శుక్రవారం ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమానికి పలిపునిచ్చారు.

కార్మిక నాయకుల ముందస్తు అరెస్టులు..

శుక్రవారం కార్మికులు ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలుసుకున్న పోలీసులు కార్మిక నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. దీంతో మిగిలిన కార్మికులు జీడిమెట్ల డిపో వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి, బీజేపీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భరతసింహారెడ్డి, వైఎర్స్సార్‌టీపీ కన్వీనర్ దేఠిరెడ్డి సురేష్, లెఫ్ట్ పార్టీలైన సీపీఎం, సీపీఐ నాయకులు కీలుకాని లక్ష్మణ్, ఉమామహేష్‌లు కార్మికుల ధర్నాకు మద్దతు పలికారు.

బీఆర్‌ఎస్ ప్రజాగ్రహానికి కొట్టుకుపోవడం ఖాయం..

కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ అంబేడ్కర్ ప్రజలకు కల్పించిన హక్కును కాలరాస్తున్న కడ్కార్ ప్రభుత్వం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలవడం ఖాయమని కూన శ్రీశైలంగౌడ్ అన్నారు.

◆ స్థానిక ఎమ్మెల్యే వివేకానంద 16నెలలుగా బోద్యం చూస్తూ కార్మికులకు న్యాయం చేయనపుడు ఎమ్మెల్యేగా ఉండి ఏమి లాభమని కొలన్ హన్మంత్ రెడ్డి ప్రశ్నించారు.

◆ కార్మిక సంక్షేమాన్ని కార్మికమంత్రి పట్టించుకోనపుడు కార్మికశాఖ మంత్రి పదవికి మల్లారెడ్డి రాజీనామా చేయాలని లెఫ్ట్ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మల్లారెడ్డి తన సొంత వ్యాపార వృద్ధి కోసమే మంత్రి పదవిలో ఉన్నారని విమర్శించారు.



మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి